# ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జననం, బాల్యం మరియు ప్రవక్తత్వం

[ తెలుగు - Telugu - تلغو ]


అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్ కరీం అష్షీహా

అనువాదం: సయ్యద్ యూసుఫ్ పాషా

రచన: జమాల్ జరబొజొ



2012 - 1433

IslamHouse.com

# ﴿ الولادة والطفولة والنبوة لرسول الله محمد ﴾
صلى الله عليه وسلم

«بلغة التلغو»

عبد الرحمن بن عبد الكريم الشيحة

ترجمة: محمد كريم الله

مراجعة: سيد يوسف باشا

2012 - 1433

IslamHouse.com

## ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జననం, బాల్యం మరియు ప్రవక్తత్వం

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం క్రీ.శ. 571 వ సంవత్సరంలో, అరేబియా ద్వీపకల్పం యొక్క ధార్మిక మరియు ఆర్థిక ముఖ్యపట్టణమైన మక్కా నగరంలో, అరబ్బులందరూ ఉన్నతమైనదిగా గౌరవించే ఖురైష్ తెగలో జన్మించినారు. అరబ్బులు మక్కా నగరాన్ని దర్శించి, తమ పూర్వీకులైన ప్రవక్త ఇబ్రాహీం అలైహిస్సలాం మరియు ఆయన కుమారుడైన ప్రవక్త ఇస్మాయీల్ అలైహిస్సలాంలు పునర్ నిర్మించిన అల్లాహ్ యొక్క మొట్టమొదటి ఆరాధనా గృహం (కాబాగృహం) చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు.

జన్మించక ముందే తండ్రిని కోల్పోయిన అనాథ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. ఆరేళ్ళ వయస్సులో తల్లిని కోల్పోయి, తాత అబ్దుల్ ముత్తలిబ్ సంరక్షణలోనికి తీసుకోబడినారు. తాత మరణం తరువాత, పినతండ్రి అబూ తాలిబ్ ఆయన సంరక్షణ బాధ్యతను తీసుకున్నారు. ఆయన తెగ మరియు ఇతర అరబ్బులు రాళ్ళ నుండి, కొయ్య చెక్కల నుండి మరియు బంగారం నుండి తయారు చేయబడిన విగ్రహాలను ఆరాధించేవారు. ఈ విగ్రహాలలో కొన్ని కాబాగృహం చుట్టూ ప్రతిష్ఠించబడినాయి. ఆ విగ్రహాలు హానిని తొలగిస్తాయని మరియు శుభం కలుగజేస్తాయని ప్రజలు విశ్వసించేవారు.

అల్లాహ్ చే ప్రవక్తగా ఎంచుకోబడక ముందు నుండే ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అత్యంత నమ్మకస్తునిగా మరియు నిజాయితీపరునిగా ప్రసిద్ధి చెందారు. ఎందుకంటే ఆయన ఏనాడూ ఎవరినీ మోసగించిలేదు మరియు వంచించలేదు. ఆయన తన ప్రజలలో 'అల్ అమీన్' (అత్యంత నిజాయితీపరుడి)గా ప్రసిద్ధి చెందారు. ప్రజలు ప్రయాణించాలని అనుకున్నపుడు, తమ విలువైన వస్తువులను ఆయనకు అప్పగించేవారు. ఆయన 'అస్సాదిఖ్' (అత్యంత సత్యవంతుడి)గా కూడా ప్రసిద్ధి చెందారు. ఎందుకంటే ఆయన ఏనాడూ చిన్న అబద్ధం కూడా పలకి ఉండలేదు. ఆయన మహోన్నతంగా ప్రవర్తించేవారు, మహోన్నతంగా మాట్లాడేవారు, అక్కర గలవారికి సహాయపడటాన్ని ఇష్టపడేవారు. ఆయన యొక్క ప్రత్యేక లక్షణాల మరియు మంచి సభ్యతా సంస్కారాల కారణంగా ప్రజలు ఆయనను ఎంతో ప్రేమించేవారు, గౌరవించేవారు. ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటించాడు:

"మరియు నిశ్చయంగా నీవు ఉత్తమమైన శీలవంతుడవు" (ఖుర్ఆన్ 68:4)

ప్రసిద్ధ స్కాటిష్ చరిత్రకారుడు మరియు రచయిత థామస్ కార్లయిలే (Thomas Carlyle, d.1885) తన పుస్తకం 'Heroes, Hero-worship and the Heroic in History' లో ఇలా వ్రాసినాడు:

కానీ, చిన్నప్పటి నుండే ఆయన వివేకవంతుడిగా గుర్తించబడినారు. ఆయన సహచరులు ఆయనను 'అల్ అమీన్' (నిజాయితీపరుడు) అని పిలిచేవారు. సత్యసంధత మరియు విశ్వసనీయత కలిగిన వ్యక్తి. తను చేసే పనులలో, పలికే పలుకులలో మరియు

తన ఆలోచనలలో ఆయన సత్యవంతులు. ఆయనలో ఎల్లప్పుడూ ఏదో ఒక ప్రత్యేకత వారికి కనబడేది. మాటలలో మితభాషి; పలకటానికేమీ లేనప్పుడు నిశ్శబ్దంగా ఉండేవారు; కానీ ఆయన పలికినప్పుడు పొందికగా, యుక్తిగా, తగిన విధంగా, నిష్కపటంగా, విశ్వసనీయంగా పలికేవారు; ఎల్లప్పుడూ అసలు విషయం పైనే దృష్టి కేంద్రీకరించేవారు. ఈ విధమైన సంభాషణే, యోగ్యమైన అసలు సంభాషణ! ఆయన జీవిత ఘటనల ద్వారా దృఢత్వం, సహోదర వాత్సల్యం, స్వచ్ఛత్వం, నిష్కళంకం మొదలైన లక్షణాలన్నింటినీ తనలో కలిగియున్న వ్యక్తిగా మనం ఆయనను కనుగొంటాము. ఒక గంభీరమైన, నిష్కపటమైన, విశ్వాసపాత్రమైన స్వభావం; అయినా స్నేహపూర్వకంగా, సాదరంగా, సహచార యోగ్యంగా, సరసంగా మెలిగేవారు. అపుడపుడు చిరునవ్వు నవ్వుతూ, పరిహాసం కూడా చేసేవారు. ఆయన నవ్వు కూడా స్వచ్ఛంగా, సహజంగా ఉండేది: ఆయన స్వతస్సిద్ధమైన, సాహసవంతమైన, న్యాయవంతమైన, నిజమైన అర్థాన్నిచ్చే ఒక పరిపూర్ణ వ్యక్తి! ఏ పాఠశాలా ఆయనకు శిక్షణ ఇవ్వలేదు. ఏ ఉపాధ్యాయుడూ, గురువూ ఆయన స్వభావాన్ని తీర్చిదిద్దలేదు మరియు ఆయనకు సభ్యతా సంస్కారాలు నేర్పలేదు. ఆయనలోని ఉన్నతమైన గుణగుణాలు ఆయనకు శిక్షణ ఇవ్వవలసిన అవసరమే లేదని చాటిచెప్పేవి. ఆయన తనకు ఇవ్వబడిన బాధ్యతను తన జీవితంలో ఒంటరిగానే పూర్తిచేసారు.

ఆయన మద్యపానం సేవించడం, విగ్రహాలను ఆరాధించటం లేదా వాటిపై ప్రమాణం చేయటం లేదా వాటి పేరున దేనినైనా బలివ్వడం మొదలైనటువంటి తప్పుడు కార్యకలాపాల్లో ఏనాడు పాల్గొనలేదు. కొంత కాలం ఆయన తన ప్రజల గొర్రెల మందను కాచే గొర్రెల కాపరిగా పనిచేసినారు. దీని గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు "అల్లాహ్ చే ఎంచుకోబడిన ప్రతి ప్రవక్తా ఒక గొర్రెల మందపై ఒక కాపరిగా ఉన్నవాడే". అది విని ఆయన సహచరులు ఇలా అడిగారు: "మీరు కూడానా, ఓ అల్లాహ్ యొక్క ప్రవక్తా?". అపుడు ఆయన "అవును, నేను మక్కావాసుల ఒక గొర్రెల మందను కాచేవాడిని"అన్నారు. (సహీహ్ బుఖారీ 2143)[1]

ప్రవక్తగా ఎంచుకోబడక పూర్వం, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హీరా గుహలో ఏకాంతంగా ఉండటాన్ని ఇష్టపడేవారు. ఒక్కోసారి అనేక రాత్రులు నిరంతరంగా అక్కడే గడిపేవారు.

---

1. మొదట పశువులతో వ్యవహరించడాన్ని నేర్పడం ద్వారా మానవులతో వ్యవహరించడానికి తయారు చేయడమే దీని వెనుక నున్న వివేకమని పేర్కొనబడింది. మేకలను మరియు గొర్రెలను మేపుట వ్యక్తులలో ప్రేమను పెంచుతుంది మరియు సున్నిత హృదయం గలవారిగా చేస్తుంది. ఆవులు, గుర్రాలు మరియు ఒంటెలను పెంచుట మరియు మేపుట ద్వారా స్థిరత్వం పెరుగుతుంది.

40 సంవత్సరాల వయస్సులో, ఒకసారి ఆ గుహ వద్ద ఉండగా, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై మొట్టమొదటిసారి వహీ (దివ్యవాణి) అవతరించింది. వహీ అవతరణ గురించి ఆయేషా రదియల్లాహు అన్హా[2] ఇలా వివరించారు:

మక్కాలోని హీరా గుహలో గడుపుతున్నపుడు, మొదటగా అల్లాహ్ యొక్క ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు మంచి స్వప్నాలు వచ్చేవి (కలల రూపంలో దివ్యవాణి అవతరించేది). ఆయనకు వచ్చిన ప్రతి కలా నిజమయ్యేది. ఉషోదయ కాంతిరేఖల వలే ఆ కలలు చాలా స్పష్టంగా ఉండేవి. ఆ తరువాత అల్లాహ్ యొక్క ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అక్కడ ఏకాంతంలో గడపటాన్ని ఇష్టపడసాగారు. దీని కొరకు ఆయన దీర్ఘకాలం పాటు, అనేక దినాలు మరియు రాత్రులు హీరాగుహలో గడిపేవారు. ఇంటికి వచ్చి, ఆహారపదార్థాలను తీసుకుని, తిరిగి మరలిపోయేవారు. తన భార్య ఖదీజా రదియల్లాహు అన్హా[3] వద్దకు వచ్చినపుడు, ఆయన ఏకాంతవాసానికి అవసరమయ్యే తాజా ఆహారపదార్థాలను ఆవిడ తయారు చేసి ఇచ్చేవారు.

ఒకసారి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హీరాగుహలో ఉండగా, దైవదూత జిబ్రయీలు ఆయన వద్దకు వచ్చి, చదవమని ఆజ్ఞాపించారు. దానికి ఆయన "నాకు చదవటం రాదు" అని జవాబిచ్చారు. అపుడు జిబ్రయీలు ఆయన శ్వాస ఆగిపోయేటంత గట్టిగా ఆయనను కౌగలించుకుని, వదలిపెట్టారు. ఆ తరువాత "ఓ ముహమ్మద్! చదువు" అని అన్నారు. మరలా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం "నాకు చదవటం రాదు" అని జవాబిచ్చారు. రెండోసారి జిబ్రయీలు ఆయన శ్వాస ఆగిపోయేటంత గట్టిగా ఆయనను కౌగలించుకుని, వదలిపెట్టారు. ఆ తరువాత "ఓ ముహమ్మద్! చదువు" అని అన్నారు. మరలా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం "నాకు చదవటం రాదు" అని జవాబిచ్చారు. మూడోసారి జిబ్రయీలు ఆయన శ్వాస ఆగిపోయేటంత గట్టిగా ఆయనను కౌగలించుకుని, ఇలా పలుకుతూ వదలిపెట్టారు "చదువు! నీ ప్రభువు పేరుతో, ఆయనే (సర్వాన్ని) సృష్టించాడు. ఆయనే మానవుణ్ణి రక్తముద్దతో (జీవకణంతో) సృష్టించాడు. చదువు! మరియు నీ ప్రభువు పరమదాత." (ఖుర్ఆన్ 96:1- 3)

అల్లాహ్ యొక్క ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం భయంతో వణుకుతూ, పరుగు పరుగున ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో ప్రవేశించి, ఖదీజా రదియల్లాహు అన్హాతో "నన్ను కప్పివేయి, నన్ను కప్పివేయి!" అన్నారు. ఖదీజా రదియల్లాహు అన్హా ఆయనను దుప్పటితో కప్పివేసారు. భయం తగ్గిన తరువాత, హీరా గుహలో అతనికి ఎదురైన అనుభవాన్ని ఆయన ఆవిడకు తెలిపి, "నాకేదో జరుగబోతుందని భయంగా ఉంది" అని అన్నారు. ఖదీజా రదియల్లాహు అన్హా ఆయనతో ఇలా పలుకుతూ ధైర్యం చెప్పినారు: "అల్లాహ్ సాక్షిగా! నీవు చింతించవద్దు. అల్లాహ్ నిన్ను ఎన్నడూ అగౌరవపరచడు.

---

[2]. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఒక భార్య.

[3]. ఖదీజా రదియల్లాహు అన్హా, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క మొదటి భార్య.

ఎందుకంటే నీవు భార్యాబిడ్డలతో మంచిగా ప్రవర్తిస్తావు. నీవు పేదలకు, అక్కరగలవారికి సహాయపడతావు. నీవు దానశీలుడివి మరియు నీవు అతిథులను ఆదరిస్తావు. కష్టాలలో ఉన్నవారికి తోడ్పడతావు."

ఆ తరువాత ఖదీజా, తన బంధువైన వరఖా ఇబ్నె నౌఫల్ ఇబ్నె అసద్ ఇబ్నె అబ్దుల్ ఉజ్జా వద్దకు తన భర్తను తీసుకువెళతారు. ఆయన ఇస్లాంకు పూర్వం (అజ్ఞాన కాలంగా ప్రసిద్ధి చెందిన కాలంలో) క్రైస్తవునిగా మారిపోతారు. ఆయన హిబ్రూ భాషలో బైబిలును వ్రాసారు, కాని తరువాత జీవితంలో ఆయన ముసలితనం వలన తన కంటిచూపును కోల్పోయారు. ఖదీజా ఆయనతో ఇలా అన్నారు "ఓ సోదరుడా! నీ మేనల్లుడు (అంటే ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) చెప్పేది విను" అది విని, వరఖా ఇలా అడిగారు "ప్రియమైన మేనల్లుడా, నీవు ఏమి చూసావు?"

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హీరా గుహలో తను చూసిన దానిని ఆయనకు తెలిపారు. అది వినగానే వరఖా ఇలా అన్నారు,

"అల్లాహ్ సాక్షిగా! అతను ప్రవక్త మూసా అలైహిస్సలాం వద్దకు వచ్చిన జిబ్రయీల్ దైవదూత. నీ ప్రజలు నిన్ను మక్కా నగరం నుండి బహిష్కరించేటప్పుడు నేను జీవించి ఉండాలని కోరుకుంటున్నాను." అది విని ఆశ్చర్యపడుతూ, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు "వారు నన్ను మక్కా నుండి బహిష్కరిస్తారా?" అవునంటూ వరఖా ఇలా అన్నారు "నీకు ఇవ్వబడిన సందేశం వంటి సందేశాన్ని, తన ప్రజలే తనపై యుద్ధం ప్రకటించటం జరగకుండా ఏ వ్యక్తీ అందజేయలేదు. ఒకవేళ ఇది నేనుండగా జరిగితే, నేను నిన్ను సమర్ధిస్తాను."

ఈ సంఘటన జరిగిన కొద్ది కాలానికే వరఖా మరణించారు. దివ్యవాణి అవతరణ కూడా కొన్నాళ్ళ వరకు ఆగిపోయింది. (బుఖారీ)

పై హదీథులో[4] పేర్కొనబడిన ఖుర్ఆన్ అధ్యాయం, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంచుకోబడిన ప్రవక్త పదవి ఆరంభాన్ని సూచిస్తుంది. ఆ తరువాత అల్లాహ్ ఈ వచనాలను అవతరింపజేసాడు.

ఓ (దుప్పటిలో) చుట్టుకున్న వాడా! లే! హెచ్చరించు! నీ ప్రభువు గొప్పదనాన్ని (ఘనతను) కొనియాడు. మరియు నీ వస్త్రాలను పరిశుభ్రంగా ఉంచుకో! (ఖుర్ఆన్ 74:1-4)

---

[4]. హదీథ్ అంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క పలుకులు, ఆచరణలు, అనుమతులు లేదా ఆయన యొక్క స్వభావం. అప్రామాణికమైన ఉల్లేఖనలు లేదా కల్పించబడిన అసత్యాలను ఎదుర్కోవటానికి, ఎలాంటి అంతరాయం లేకుండా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వరకూ చేరే నమ్మకస్తులైన ఉల్లేఖకుల పరంపరచే ఉల్లేఖించబడిన కొన్ని హదీథుల ప్రామాణికతను చారిత్రకంగా పరిశోధించటానికి హదీథు విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చేయబడినది.

ఖుర్ఆన్ యొక్క ఈ అధ్యాయం అవతరించగానే, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా ప్రజలను బహిరంగంగా ఇస్లాం వైపు పిలవటం ప్రారంభించారు. తన స్వంత బంధువులతో మరియు తన స్వంత తెగతో ఆయన ప్రారంభించారు. కానీ వారిలో చాలా మంది ఆయన మాట వినటాన్ని గట్టిగా తిరస్కరించారు. ఎందుకంటే ఆయన వారిని అంతకు ముందెన్నడూ వినని విషయం వైపునకు మరియు తరతరాలుగా తమలో నాటుకుపోయిన విగ్రహారాధనను ఖండిస్తున్న విషయం వైపునకు పిలుస్తున్నారు.

ఇస్లాం ఒక సంపూర్ణ జీవన విధానం. ధార్మిక, రాజకీయ, ఆర్థిక మరియు సామాజిక విషయాలన్నింటితో అది వ్యవహారం జరుపుతుంది. కేవలం అల్లాహ్ ను మాత్రమే ఆరాధించమని పిలవటమే కాకుండా, విగ్రహారాధనలన్నింటినీ త్యజించమనీ మరియు ప్రీతికరమైనవిగా భావించే మత్తుపదార్థాలు, వ్యభిచారం, జూదం, వడ్డీ వంటి వాటిని కూడా త్యజించమని పిలుస్తున్నది. పరస్పరం న్యాయంగా మరియు మంచిగా ప్రవర్తించవలెనని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. వారందరూ సమానులేనని, వారి మధ్య ఎలాంటి తేడాలు లేవని, అల్లాహ్ పట్ల కలిగి ఉండే భయభక్తులు మాత్రమే వారి స్థానాన్ని ఉన్నత పరుస్తాయని ఆయన స్పష్టం చేసారు. అరబ్బులలో అత్యుత్తమమైన ఖురైషీ తెగ, తన కంటే తక్కు స్థాయి తెగలతో మరియు బానిసలతో సమానంగా చూడబడటాన్ని ఎలా అంగీరించగలదు! గట్టిగా ఇస్లాం స్వీకరించడాన్ని తిరస్కరించడమే కాకుండా, ఆయనను అనేక విధాలుగా కష్టపెట్టసాగారు మరియు అవమాన పరచే ఉద్దేశంతో ఆయనను మతిస్థిమితం కోల్పోయిన వాడని, మాంత్రికుడని, జ్యోతిష్కుడని మరియు అసత్యపరుడని పిలిచేవారు. ఇస్లాం కంటే పూర్వం ఆయనపై మోపటానికి సాహసించలేని నేరాలను, వారు ఆయనపై ఆరోపించసాగారు. సామాన్య ప్రజలను ఆయనకు హాని కలిగించమని ఆయనకు విరుద్ధంగా ఉసిగొలిపే వారు. ఆయన సహచరులను అణగద్రొక్కమని మరియు చిత్రహింసలు పెట్టమని పురిగొల్పేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దగ్గరి సహచరుడు అబ్దుల్లాహ్ ఇబ్నె మస్ఊద్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు "కాబాగృహానికి దగ్గరగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నమాజు చేయటం కొరకు నిలుచున్నపుడు, సమీపంలో కూర్చుని ఉన్న ఖురైషీయుల సమూహంలో నుండి ఒకతను ఇలా అన్నాడు: 'ఈ మనిషిని చూశారా మీరు? మాంసము తీసుకుని పారవేసిన ఫలానా వారి ఒంటెల పేగులు, కసురు, కశ్మలము మొదలైన మలినాలను ఎవరైనా తెచ్చి, ఆయన సజ్దాలో వెళ్ళే వరకు నిరీక్షించి, ఆయన భుజాల మధ్యన ఆ బరువును ఉంచగలరా?' ". వారిలో నుండి పరమ నీచుడు ఆ పని చేయటానికి సిద్ధపడినాడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సజ్దాలోనికి వెళ్ళగానే, అతడు ఆయన వీపుపై భుజాల మధ్య, చాలా బరువుగా ఉన్న ఆ మురికిని ఉంచాడు. ఆ బరువుకు ఆయన సజ్దాలో నుండి లేవలేక, ఇబ్బంది పడసాగారు. అది చూసి వారు ఒకరిపై మరొకరు పడిపోయేటంతగా పగలబడి నవ్వసాగారు. అక్కడి ప్రజలలో నుండి ఒకతను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కుమార్తె అయిన ఫాతిమా రదియల్లాహు అన్హా వద్దకు వెళ్ళి కాబాగృహం వద్ద జరుగుతున్న దానిని తెలిపాడు. అపుడు ఆవిడ వయస్సులో చాలా చిన్నది. ఆవిడ వెంటనే పరుగు పరుగున ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి,

ఆయన వీపుపై నుండి ఆ బరువును తొలగించింది. ఆ తరువాత అక్కడ కూర్చుని ఉన్న ఆ ఖురైషీయులను శపించింది. (సహీహ్ బుఖారీ)

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఒక సహచరుడు మునీబ్ అల్ అజ్దీ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: "అజ్ఞాన కాలంలో ప్రజలతో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అంటూ ఉండగా నేను చూసాను: 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని పలకండి, అది మిమ్మల్ని విజయవంతుల్ని చేస్తుంది. " అది విని, కొందరు ఆయన ముఖంపై ఉమ్మేశారు, కొందరు ఆయన ముఖంపై మట్టి విసిరారు మరియు మరికొందరు మధ్యాహ్నం వరకు ఆయనను దూషిస్తూ ఉండినారు. ఒకసారి ఎవరో ఒక బాలిక ఆయన వద్దకు పెద్ద తోలుతిత్తిలో నీరు తీసుకు వస్తే, దానితో ఆయన తన ముఖాన్ని మరియు చేతులను కడుక్కొని, ఆ బాలికతో ఇలా పలికారు "ఓ పుత్రికా! నీ తండ్రి అవమానానికి గురి అవుతాడనో లేదా బీదరికం అతనిపై విరుచుకు పడుతుందనో నీవు భయపడవద్దు." (ముజమ్ అల్ కబీర్)

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు, మక్కా ముష్రికులు (విగ్రహారాధకులు) పెట్టిన ఇబ్బందులను గురించి అడిగిన ప్రశ్నకు జవాబుగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సహచరుడైన అబ్దుల్లాహ్ బిన్ అమర్ అల్ ఆస్ రదియల్లాహు అన్హుమా ఇలా అన్నారు: "ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాబాగృహం వద్ద నమాజు చేస్తుండగా, (ఒకసారి, ఒక ముష్రికు) సమీపానికి వచ్చి, ఆయన దుస్తులను ఆయన మెడ చుట్టూ, గట్టిగా బిగించసాగాడు. అబూ బకర్ (రదియల్లాహు అన్హు)[5] వెంటనే పరుగెత్తుకుంటూ వచ్చి, ఇలా అంటూ అతడి భుజం పట్టుకుని, అతడిని దూరంగా త్రోసివేసారు: 'అల్లాహ్ యే తన ఆరాధ్యుడని ప్రకటించినందుకు గాను మరియు మీ ప్రభువు నుండి స్పష్టమైన సూచనలు మీ వద్దకు తీసుకు వచ్చినందుకు గాను, మీరు ఒక వ్యకిని చంపాలనుకుంటున్నారా?' " సహీహ్ బుఖారీ.

ఇస్లాం వైపు ఆహ్వానించటం నుండి ఇటువంటి సంఘటనలు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఆపలేకపోయాయి. హజ్ యాత్ర[6] కొరకు మక్కా వచ్చిన తెగలకు ఆయన తనపై అవతరించబడిన దివ్యసందేశాన్ని బోధించటం కొనసాగించారు. మక్కా నగరానికి ఉత్తరంలో ఉన్న యత్రిబ్ అనే ఒక చిన్న పట్టణం నుండి హజ్ యాత్ర కొరకు వచ్చిన ఒక చిన్న బృందం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై విశ్వాసం ప్రకటించింది మరియు ఒకవేళ వారి వద్దకు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం వలస వస్తే, తాము పూర్తిగా సమర్ధిస్తామని వారు ఆయనకు వాగ్దానం చేశారు. ఇస్లాం ధర్మ విధులు బోధించటానికి ఆయన (సల్లల్లాహు

---

[5]. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అత్యంత దగ్గరి సహచరుడు మరియు ఆయన మరణానంతరం ఇస్లాం యొక్క మొదటి ఖలీఫా.

[6]. అల్లాహ్ ఆదేశించిన విధంగా నిర్ణీత సమయంలో, నిర్ణీత పద్ధతిలో మక్కా సందర్శనం మరియు అక్కడి ఆచరణలు, ఆరాధనలు.

అలైహి వసల్లం) తన సహచరుడైన ముసాబ్ ఇబ్నె ఉమైర్ రదియల్లాహు అన్హును వారితో పాటు పంపారు. మక్కాలో తమ స్వంత ప్రజలచే ముస్లింలు ఎంతో దౌర్జన్యానికి మరియు హింసకు గురైన తరువాత, మదీనాకు వలస పోవటానికి అల్లాహ్ వారికి అనుమతినిచ్చాడు. మదీనావాసులు ఎంతో సంతోషంగా, ఉల్లాసంగా, ఆప్యాయంతో, ఆదరణతో వారిని ఆహ్వానించారు. మదీనా నూతన ఇస్లామీయ సమాజానికి ప్రధాన పట్టణంగా మారినది. అక్కడి నుండి ఇస్లాం దూరదూరాలకు, విస్తృతంగా వ్యాపించింది.

స్వంత ప్రాణం కంటే అధికంగా తనను ఇష్టపడే విధంగా ఎదిగిన మదీనా వాసులకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ యొక్క ఆదేశాలను ఉపదేశించారు మరియు అభ్యాసం చేయించారు. ఆయనకు సేవలు చేయడానికి, తమ వద్ద నున్నదంతా అల్లాహ్ కొరకు ఇస్లాం మార్గంలో ఖర్చు చేయడానికి వారు పోటీ పడేవారు. చాలా దృఢంగా మరియు సంపూర్ణంగా అల్లాహ్ ను విశ్వసించటం వైపు ఆ సమాజం ప్రయాణించసాగింది. ఐకమత్యం, తోడ్పాటు, సహాయసహకారాలు, పరస్పర ప్రేమాభిమానాలు మరియు సోదరత్వం మొదలైన మంచి అలవాట్లను అలవర్చుకోవడంతో, ప్రజలలో ఆనందోత్సాహాలు స్పష్టంగా కనబడసాగాయి. అల్లాహ్ ధర్మంలో ప్రజలందరూ సమానులుగా మరియు ఒకరికొకరు సోదరులుగా పరిగణింపబడతారు. ధనవంతులు మరియు పేదప్రజలు, నల్లవారు మరియు తెల్లవారు, అరబ్బులు మరియు అరబ్బేతరుల మధ్య ఎలాంటి తేడాలు, భేధభావాలు, తారతమ్యాలు, పక్షపాతాలు ఉండవు. సంపద, రంగు, జాతి మొదలైనవి వారి స్థాయిని మార్చలేవు - అల్లాహ్ యొక్క భయభక్తులు మరియు మంచి లక్షణాలు తప్ప.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క పిలుపు దావానలంలా వ్యాపిస్తున్న విషయాన్ని గ్రహించిన ఖురైషీయులు, ఇస్లాం వ్యాప్తిని ఎలాగైనా ఆపాలని దృఢంగా నిర్ణయించుకున్నారు. ఇస్లాం పై మొట్టమొదటి యుద్ధం చేసారు. అది బదర్ యుద్ధం పేరుతో ప్రసిద్ధి చెందినది. వారు సైనిక సంఖ్యలోనూ మరియు ఆయుధాల సంఖ్యలోనూ అనేక రెట్ల ఆధిక్యత కలిగి ఉండినప్పటికీ, ఓటమి చవిచూసారు. ముస్లింల వైపు సరైన ఆయుధాలు లేని 314 సైనికులు యుద్ధం చేయడానికి ముందుకు రాగా, మక్కా బహుదైవాధకుల వైపు 1000 మంది బలమైన సాయుధ సైనికులు దాడికి దిగినారు. అయినప్పటికీ, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఆయన సహచరులకే అల్లాహ్ స్పష్టమైన విజయాన్ని ప్రసాదించినాడు. ఆ తరువాత ముస్లింల మరియు మక్కా బహుదైవారాధకుల మధ్య అనేక యుద్ధాలు జరిగాయి. ఎనిమిది సంవత్సరాల తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం 10,000 మందితో కూడిన బలమైన సైన్యాన్ని తయారుచేయగా, అది మక్కా నగరాన్ని అవలీలగా జయించింది. ఆ ఘనవిజయంతో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తనకు మరియు తన సహచరులకు అనేక విధాలుగా హాని కలిగించిన మరియు హింసించిన మక్కావాసులను వశపరచుకున్నారు. తమ చేతజిక్కిన వారిని అన్ని రకాల క్రూరత్వానికి గురి చేసి, వారు తమపై జరిపిన హింసలకు మరియు అరాచకానికి ప్రతీకారం తీర్చుకునే అవకాశం లభించినప్పటికీ, ఆ విజయ సందర్భంలో ఆయన వారితో చాలా ఉదారంగా

వ్యవహరించినారు. స్పష్టమైన ఘన విజయం సాధించిన ఈ సంవత్సరం 'విజయ సంవత్సరం'గా ప్రసిద్ధి చెందినది. దీని గురించి అల్లాహ్ ఖుర్ఆన్ లో ఇలా ప్రకటించినాడు.

"(ఓ ముహమ్మద్!) ఎప్పుడైతే అల్లాహ్ సహాయం వస్తుందో మరియు విజయం (లభిస్తుందో), మరియు నీవు ప్రజలను గుంపులు గుంపులుగా అల్లాహ్ ధర్మం (ఇస్లాం)లో ప్రవేశించడం చూస్తావో, అపుడు నీవు నీ ప్రభువు స్తోత్రంతో పాటు ఆయన పవిత్రతను కొనియాడు మరియు ఆయన క్షమాభిక్షను అర్థించు. నిశ్చయంగా, ఆయనే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు. " సూరహ్ అన్నస్ర్ 110:1-3

మక్కావిజయం తరువాత, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కావాసులను సంబోధించి, ఇలా అన్నారు:

"ఇపుడు మిమ్మల్నేమి చేస్తానని అనుకుంటున్నారు?" దానికి వారిలా అన్నారు : "మీరు మాకు కేవలం మంచినే చేస్తారు. మీరు దయ మరియు ఔదార్యం గల సోదరులు. దయ మరియు ఔదార్యం గల బంధువులు!" అపుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు : "వెళ్ళండి, మీరు విముక్తులు." బైహఖీ గ్రంథం.

ఈ గొప్ప క్షమాభిక్ష వలన వేల మంది ప్రజలు ఇస్లాం స్వీకరించారు. తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తిరిగి మదీనాకు చేరుకున్నారు. కొన్నాళ్ళ తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్ యాత్ర చేయాలని సంకల్పించారు. దాదాపు 114,000 సహచరులతో ఆయన మక్కా నగరానికి చేరుకుని, హజ్ యాత్ర పూర్తిచేసినారు. ఈ హజ్ 'హజ్జతుల్ విదాఅ' అనే పేరుతో ప్రసిద్ధి గాంచింది. ఎందుకంటే ఈ హజ్ తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరో హజ్ చేయలేదు మరియు హజ్ చేసిన కొద్ది కాలానికే మరణించారు.

9వ దిల్ హజ్ నాడు అరాఫాత్ కొండ వద్ద, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన వీడ్కోలు ప్రసంగం చేసారు. అల్లాహ్ ను స్తుతించిన తరువాత, ఆయన ఇలా అన్నారు:

"ఓ ప్రజలారా! శ్రద్ధగా వినే చెవిని నాకు అప్పగా అప్పగించండి, ఎందుకంటే నేను ఈ సంవత్సరం తర్వాత మీ మధ్యన జీవించి ఉంటానో లేదో నాకు తెలియదు. కాబట్టి, నేను మీకు చెబుతున్న దానిని చాలా జాగ్రత్తగా వినండి మరియు ఈ పలుకులను (సందేశాన్ని) నేడు ఇక్కడ హాజరు కాలేకపోయిన వారికి కూడా చేర్చండి.

ఓ ప్రజలారా! మీరు ఈ నెలను, ఈ దినమును పవిత్రమైనదిగా పరిగణించినట్లే, ప్రతి ముస్లిం యొక్క జీవితాన్ని (ప్రాణాన్ని) మరియు సంపదను(ఆస్తిని) పవిత్రమైన విశ్వాస నిక్షేపంగా (నమ్మికగా) పరిగణించవలెను. మీ వద్ద నమ్మకంతో ఉంచిన వస్తువుల్ని, వాటి అసలైన యజమానులకు తిరిగి వాపసు చెయ్య వలెను. మీరు ఎవ్వరికీ హాని కలిగించ కూడదు, దాని వలన మీకెవ్వరూ హాని కలిగించరు. 'నిశ్చయంగా మీరు మీ రబ్ (ప్రభువు)

ను కలుసుకోబోతున్నారు మరియు ఆయన నిశ్చయంగా మీ కర్మల లెక్క తీసుకోబోతున్నాడు' అనే విషయాన్ని జ్ఞాపకం ఉంచు కోవలెను.

మీరు వడ్డీ తీసుకోవటాన్ని అల్లాహ్ నిషేధించాడు; కాబట్టి ఇక మీదట వడ్డీ వ్యాపారానికి సంబంధించిన నియమనిబంధనలన్నీ, హక్కులన్నీ రద్దు చేయబడినవి. మీ యొక్క అసలు మూలధనం మాత్రం మీరు తీసుకోవచ్చును. మీరు అసమానత్వాన్ని (హెచ్చుతగ్గులను, భేదాలను, వైషమ్యాలను) బలవంతంగా రుద్దకూడదు మరియు సహించకూడదు. వడ్డీ నిషేధించబడినదని అల్లాహ్ తీర్పునిచ్చినాడు మరియు అబ్బాస్ ఇబ్నె అబ్దుల్ ముత్తలిబ్ కు చెల్లించ వలసి ఉన్న మొత్తం వడ్డీ ఇక మీదట రద్దు చేయబడినది.

షైతాన్ నుండి మీ ధర్మాన్ని కాపాడుకునేందుకు అప్రమత్తంగా (జాగ్రత్తగా) ఉండవలెను. అతడు పెద్ద పెద్ద విషయాలలో మిమ్ముల్ని తప్పు దారి పట్టించే శక్తి తనకు ఏ మాత్రం లేదని తెలుసుకుని, తన ఆశలన్నీ వదులుకున్నాడు. కాబట్టి చిన్న చిన్న విషయాలలో కూడా అతడిని అనుసరించకుండా అప్రమత్తంగా ఉండవలెను.

ఓ ప్రజలారా! మీ స్త్రీలపై మీకు కొన్ని ప్రత్యేక హక్కులు ఉన్నమాట వాస్తవమే కాని వారికి కూడా మీ పై హక్కులు ఉన్నాయి. జ్ఞాపకం ఉంచుకోండి, కేవలం అల్లాహ్ పై ఉన్న విశ్వాసం ఆధారంగానే మరియు అల్లాహ్ యొక్క అనుమతి మూలంగానే మీరు వారిని తమ తమ భార్యలుగా చేసుకున్నారు.

మీ స్త్రీలతో మంచిగా ప్రవర్తించండి మరియు దయాదాక్షిణ్యాలతో వ్యవహరించండి ఎందుకంటే వారు మీ జీవిత భాగస్వాములు మరియు శ్రద్ధాభక్తులతో, సేవానిరతితో సహాయ సహకారాలందించే అంకితమైన సహాయకులు. ఒకవేళ వారు స్థిరంగా మీ హక్కులను పూర్తిచేస్తున్నట్లయితే, మీ నుండి దయతో ఆహారం (అన్నపానీయాలు) మరియు దుస్తులు పొందే హక్కు వారి స్వంతమవుతుంది. ఇంకా మీరు అనుమతించని(ఇష్టపడని) వారితో, వారు స్నేహంగా మెలగకూడదనేది మరియు తమ శీలాన్ని అస్సలు కోల్పోకూడదనేది (వ్యభిచరించకూడదు, తుంటరిగా ప్రవర్తించకూడదు) వారిపై మీకున్న హక్కు.

ఓ ప్రజలారా! అత్యావశ్యకంగా నా మాట వినండి. కేవలం అల్లాహ్ నే ఆరాధించండి, ప్రతి దినపు ఐదు తప్పని సరి నమాజులను పూర్తిచేయండి, రమదాన్ నెలలో తప్పనిసరిగా ఉపవాసం ఉండండి మరియు తప్పనిసరి అయిన విధిదానం (జకాత్) పేదలకు పంచిపెట్టండి. ఒకవేళ మీకు తగిన శక్తిసామర్ధ్యాలు ఉన్నట్లయితే, హజ్ యాత్ర పూర్తిచేయండి.

మొత్తం మానవజాతి ఆదం (అలైహిస్సలాం) సంతతి యే మరియు అరబ్ వాసులకు ఇతరులపై ఎటువంటి ఆధిక్యం లేదు, మరియు ఇతరులకు అరబ్ వాసులపై ఎటువంటి ఆధిక్యం లేదు; అలాగే నల్లవారిపై తెల్లవారికి ఎటువంటి ఆధిక్యం లేదు మరియు తెల్లవారిపై నల్లవారికి ఎటువంటి ఆధిక్యం లేదు, కేవలం దైవభక్తి మరియు మంచి ప్రవర్తనలో తప్ప.

ప్రతి ఒక్క ముస్లిం, ప్రతి ఒక్క ఇతర ముస్లింకు సోదరుడని మరియు ముస్లింలు సోదరభావాన్ని తప్పక స్థాపించాలని గ్రహించవలెను. తోటి ముస్లింలకు చెందిన వాటిపై, మీకు ఎటువంటి అధీనం (ఔరసత్వం) లేదు, కాని స్వతంత్రంగా మరియు మనస్పూర్తిగా వారు ఇష్టపడి మీకిస్తే తప్ప. కాబట్టి, ఈ విధంగా మీకు మీరే (ఇతరుల హక్కును గౌరవించకుండా) అన్యాయంచేసుకోవద్దు.

జ్ఞాపకం ఉంచుకోండి, ఒకరోజు మీరు అల్లాహ్ ముందు హాజరవబోతున్నారు. మీరు చేసిన ప్రతి పనికి, ప్రతి ఆచరణకు ఆ రోజున సమాధానం ఇవ్వవలసి ఉంటుంది. కాబట్టి, జాగ్రత్త! నేను ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోయిన తర్వాత మీరు సత్యమార్గానికి దూరం కావద్దు.

ఓ ప్రజలారా! నా తర్వాత వేరే ప్రవక్త లేక వేరే సందేశహరుడు రాడు. మరియు ఏ క్రొత్త ధర్మమూ పుట్టదు. కాబట్టి వివేకంతో, జ్ఞానంతో, బుద్ధితో సరిగ్గా వ్యవహరించండి.

ఓ ప్రజలారా! ఇంకా, నేను మీకు తెలియజేస్తున్న ఈ పదాలను మంచిగా అర్థం చేసుకోవలెను – నేను నా వెనుక రెండు విషయాలను వదిలి వెళ్ళుతున్నాను, ఒకటి ఖుర్ఆన్ మరియు రెండోది నా నిదర్శనం, దృష్టాంతం (సున్నత్) మరియు మీరు ఈ రెండింటినీ గనుక అనుసరిస్తే, ఎట్టి పరిస్థితిలోను మార్గభ్రష్టులు కారు.

నా వాక్కులు వింటున్న మీరందరూ, వీటిని ఇతరులకు చేర్చవలెను, ఇంకా ఆ ఇతరులు వేరే ఇతరులకు చేర్చవలెను. అలా విన్నవారిలో చిట్టచివరి తరం వారు, ఇప్పుడు నా నుండి ప్రత్యక్షంగా వింటున్న మీకంటే మంచిగా అర్థం చేసుకోవటానికి ఆస్కారం ఉన్నది.

ఓ అల్లాహ్, నేను నా కివ్వబడిన దివ్యసందేశాన్ని నీ ప్రజలకు అందజేసానని సాక్ష్యంగా ఉండవలెను.

కొన్ని ఉల్లేఖనల ప్రకారం హిజ్రీ 11వ సంవత్సరం, రబ్బిల్ అవ్వల్ 12వ తేదీన ఆయన మదీనాలో మరణించారు. మదీనాలో ఆయన ఎక్కడైతే మరణించారో, అదే స్థలంలో సమాధి చేయబడినారు. ఆయన మరణవార్త విని ముస్లింలు దిగ్భ్రాంతి చెందారు మరియు కొందరు సహచరులైతే ఆ వార్తను నమ్మలేకపోయారు. ఉమర్ (రదియల్లాహు అన్హు) ఎంతగా క్షోభచెందారంటే, ఆయన ప్రజల మధ్య నిలబడి, చేతిలో కత్తి పట్టుకుని, ఇలా అనటం మొదలుపెట్టారు: “ఎవరైనా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించారని అంటే, నేను అతడి మెడ నరికేస్తాను!” అపుడు అబూ బకర్ (రదియల్లాహు అన్హు) ప్రజలను సంబోధిస్తూ, అల్లాహ్ యొక్క ఈ వచనాలను పఠించారు,

“మరియు ముహమ్మద్ కేవలం ఒక ‘రసూల్’ (సందేశహరుడు) మాత్రమే. నిస్సందేహంగా ఆయనకు పూర్వం ఎందరో సందేశహరులు గతించిపోయారు. మరి ఒకవేళ ఆయన మరణించినా లేదా చంపబడినా మీరు మీ కాలి మడమలపై (ఇస్లాం ధర్మం నుండి) వెనుదిరిగి వెళ్ళిపోతారా? (గుర్తుంచుకోండి) ఎవరైతే అలా వెనుదిరిగి పోతారో, వారు అల్లాహ్

కు అణువంత కూడా నష్టం కలిగించలేరు. మరియు కృతజ్ఞులై ఉండే వారికి, అల్లాహ్ త్వరలోనే తగిన ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు." ఖుర్ఆన్ 3:144

ఈ ఆయతు వినగానే ఉమర్ (రదియల్లాహు అన్హు) తన మాటలు ఆపి, కత్తి ఒరలో పెట్టుకున్నారు. ఎందుకంటే అల్లాహ్ ఆజ్ఞలను ఆచరించటంలో మరియు అల్లాహ్ ఆజ్ఞలను ఉల్లంఘించకుండా జాగ్రత్త పడటంలో ఆయన చాలా ఆసక్తి చూపేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం 63 సంవత్సరాల వయస్సులో మరణించారు.

అల్లాహ్ చే ప్రవక్తగా ఎంచుకోబడక పూర్వం, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాలో 40 సంవత్సరాలు గడిపారు. ప్రవక్త బాధ్యతలు అప్పగించబడిన తరువాత, ప్రజలను పరిశుద్ధమైన ఇస్లామీయ ఏకదైవారాధన విశ్వాసం వైపుకు పిలుస్తూ, ఆయన మక్కాలో మరో 13 సంవత్సరాలు గడిపారు. ఆ తరువాత ఆయన మదీనాకు వలస పోయి, అల్లాహ్ నుండి వహీ (దివ్యవాణి) అందుకుంటూ మరియు ప్రజలను ఇస్లాం వైపునకు ఆహ్వానిస్తూ, చివరికి ఖుర్ఆన్ మరియు ఇస్లాం పరిపూర్ణమయ్యే వరకు ఆయన అక్కడ దాదాపు 10 సంవత్సరాలు గడిపారు.

ప్రఖ్యాత రచయిత మరియు విమర్శకుడు జార్జి బెర్నార్డ్ షా (మరణం 1950) ఇలా అన్నారు:

"దాని యొక్క అత్యద్భుతమైన సజీవత్వం వలన ముహమ్మద్ యొక్క ధర్మాన్ని నేను ఎల్లప్పుడూ ఎంతో గౌరవిస్తాను. మారుతున్న ఉనికి, జీవనం యొక్క దశలను తనలో కలుపుకోగల సామర్థ్యమున్న ధర్మం కేవలం ఇదొక్కటే అని స్పష్టమవుతున్నది. ఇది ప్రతి తరాన్ని సంబోధిస్తున్నది. నేడు యూరోపు ముహమ్మద్ యొక్క ధర్మాన్ని స్వీకరించటం మొదలు పెట్టినట్లుగా, భవిష్యత్తులోనూ ఇది యూరోపుకు స్వీకారయోగ్యంగా నిలదొక్కుకోగలదని నేను భావిస్తున్నాను. అజ్ఞానం లేదా మతదురభిమాన వలన మధ్యయుగాల క్రైస్తవ పండితులు ముహమ్మదీయ మతానికి నల్లటి రంగులు పులిమారు. నిజానికి వారు ముహమ్మద్ ను మరియు ఆయన ధర్మాన్నీ అసహ్యించుకునేటట్లు శిక్షింపబడినారు. వారి దృష్టిలో ముహమ్మద్ ఒక క్రీస్తువిరోధి (యాంటీక్రైస్టు). నేను ఆయన గురించి క్షుణ్ణంగా పరిశోధించాను - ఆయన ఒక అద్భుతమైన వ్యక్తి. క్రీస్తువిరోధి లక్షణాలు ఆయనలో మచ్చుకైనా లేవని మరియు ఆయన తప్పకుండా మానవజాతి ముక్తిదాతగా, రక్షకుడిగా పిలవబడాలని నేను అభిప్రాయబడుతున్నాను[7]".

[7]. Enclopedia of Seerah, by Afzalur Rahman.